

గత పది సంవత్సరాలుగా రచనలుచేస్తూ, వందల కథలు, అరడజను నవలలు వ్రాసి, కథలకి అయిదుసార్లు, నవలకి ఒకసారి బహుమతులు గెల్చుకున్న నాకు, "ఓ కథ రాయండి" శీర్షికన వచ్చిపడ్డ అసంఖ్యాకమైన కథల్లోంచి రెండు కథలు ఎన్నిక చెయ్యటం కొంచం కష్టమేఅనిపించింది.

నేను సహజంగా హాస్యప్రియుడిని గనుక "షాక్" కథని సాధారణంగా ఎన్నుకునే ఇతివృత్తాలకి దగ్గరగా వుండటంచేత 'పూర్ ఫెలో' కథని ఎన్నికచేసాను...మిగతా కథలలో కేవలం ఆవేశమేగాని, లాజిక్కు, రీజనింగు నిండుకున్నాయ్. ఆ రచయితలు గ్రహించగలరని సవినయంగా మనవి చేస్తున్నాను.

రూపాయికి విలువలేని ఈ రోజుల్లో తెలుగు వారపత్రిక... కేవలం ఒక్క రూపాయికి హేట్సాఫ్ టు మల్లాది... అండ్ బెస్టాఫ్ లక్—

## 'స్రవంతి' నెం.1లో ఇచ్చిన వాక్యం ఆధారంగా రాసిన కథలు

## షాక్

"యూ స్కౌండ్రల్" అంటూ పార్కులో తన భర్తని చాచి లెంపకాయకొట్టింది రాధ.

కట్... కట్... అంటూ అరిచాడు దర్శకుడు జంధ్యాల. ఏకకాలంలో డైలాగ్ డెలివరి, మూవ్‌మెంట్ చేసింది శిరీష.

అది 'పులవర్ధిని' ప్రొడక్షన్స్‌వారి మూడవ చిత్రం షూటింగ్. హైదరాబాదు, ఇందిరా పార్కులో ఆ రోజు ఉదయంనుండి జరుగుతుంది ఆ సీను షూటింగ్. అప్పటికే పన్నెండు గంటలు కావస్తుంది. అప్పటికి అది పదహారవ టేకు. ఎన్నిసార్లు చేసినా రాధ పాత్రధారిణి శిరీష మొహంలో కోపం పలకడంలేదు. చాలా విసుగ్గావుంది యూనిట్ లో అందరికీ.

"చూడమ్మా" అంటూ శిరీష దగ్గరకొచ్చి జంధ్యాల, "ఇది కోపంతో దహించుకుపోతున్నట్లు నటించాల్సిన సీను, కళ్ళలో నిప్పులుకురిపించాలి. బాడి మూవ్‌మెంట్స్ ఫాస్ట్‌గావుండాలి. డైలాగ్ ముందుచెప్పి, తరువాత చెంపదెబ్బకొట్టాలి. అర్థమైందా?" అని చెప్పి "రడీ, టేక్" అంటూ క్లాప్ బోయ్‌వైపు చూశాడు.

క్లాప్‌బోయ్ క్లాప్ చేసిన తరువాత,

శిరీష "యూ స్కౌండ్రల్" అంటూనే చెయ్యి ఎత్తింది.

"కట్...కట్..." అంటూ ముప్పైనాలుగోసారి అరిచాడు జంధ్యాల. షాట్ ఓ.కె.కాలేదు.

లాభంలేదు అనుకొని ప్రక్కనే వున్న ఛైర్‌లో కూర్చుని అసహనంగా సిగరెట్ వెలిగించాడు జంధ్యాల.

"ఏమిటండీ ఈసుత్తి, ఎంతసేపు ఈసీను" అంటూ వచ్చి ప్రక్కనే కూర్చున్నాడు భర్త పాత్రధారి వేలు.

కొంచంసేపు టచ్ అప్ చేసుకుంటున్న శిరీషకేసి ఆలోచిస్తూ చూసి వేలుతో ఏదోచెప్పాడు దర్శకుడు జంధ్యాల.

వేలు ఉత్సాహంగా లేచి టచ్ అప్ పూర్తి అయి స్పాట్‌లో డైలాగ్ రిహార్సల్ చేస్తున్న ఆమె దగ్గరకు వెళ్ళాడు.

దర్శకుడి సైగ అందుకుని కెమెరామెన్ రడీఅయ్యాడు.

వేలు శిరీషతో "ఏం శిరీషా, విదేశాల్నుండి ఇండియాకు 'ఎయిడ్స్' తెచ్చిన తొలిమహిళవు నీవేనటగా" అన్నాడు. శిరీష తోకతొక్కిన తాచులాగా "యూ స్కౌండ్రల్" అంటూ చాచికొట్టింది ఫెడీల్మంటు.

వేలు దవడ పేలిపోయినా, షాట్ ఓ. కే. అయింది.

—ఎర్రా కోటేశ్వరరావు
(గుంటూరు)

## పూర్ ఫెలో

సాయంత్రం అయిదు గంటలవేళ—

ఇందిరా పార్కు ముందువచ్చి ఆగింది ఒక టూరిస్ట్ బస్. అందులో నుండి బిలబిల్లాడుతూ దిగేరు రకరకాల దుస్తుల్లో సీతాకోక చిలుకల్లా మెరిసిపోతున్న అమ్మాయిలు. అందర్లోకి చుక్కల్లో చంద్రుడిలా వెలిగిపోతోంది రాధ. వాళ్ళంతా గుంటూరు నుండి ఈ ఉదయమే వొచ్చేరు, సరదాగా హైదరాబాద్ చూసి వెళ్ళడానికని.

చీకటిపడేదాకా పార్కులో గడిపి ఆ తర్వాత బిర్లామెందిర్ చూసి, దగ్గర్లో భోజనాలకార్యక్రమం ముగించుకుని బసకు చేరుకోవాలన్నది ఈనాటి వారి ప్రోగ్రాం.

రాధకి మూడునెలల క్రిందటే వివాహం జరిగిపోయింది-తనింకా ఫైనల్ ఇయర్ బి. ఏ. కాబట్టి ఈ వొక్క సంవత్సరమూ కష్టపడితే డిగ్రీ వొస్తుందని పట్టుబట్టి-మరీ కంటిన్యూ చేస్తోంది.

రాధభర్త వినయ్ ఇక్కడే స్టేట్ బ్యాంక్‌లో పనిచేస్తున్నాడు. భర్తకి తనీవూరు వొస్తున్నట్లు తెలియదు. ఉత్తరం వ్రాయలేదు తను. రేపు ఉదయం అతడు పనిచేసే బ్యాంక్‌కి వెళ్ళి అతడిని ఒక్కసారిగా ఆశ్చర్యానందాల్లో ముంచెయ్యాలని ప్లాన్ వేసుకుంది—

భర్త గుర్తుకు రాగానే రాధ చెంపలమీదికి ఎరుపు, పెదిమలపైకి నవ్వు పాకివొచ్చేయి-

"రాధాదేవి తర్వాత కలలు కందువుగాని తల్లీ. అక్కడ కూల్‌డ్రింక్స్ అమ్ముతున్నారు త్రాగివద్దాం వొస్తావా?" అన్న స్నేహితురాలు మాటలకి నవ్వుకుంటూ వెంట నడిచింది రాధ.

కూల్‌డ్రింక్స్ త్రాగి చెరొక పాప్‌కార్న్ కొనుక్కుని ఓ బెంచీపై కూర్చున్నారు. ఇద్దరూ ఒక్కొక్కటీ తింటూ కంటికి కన్పిస్తోన్న అందాల్నిచూస్తూ-ఆదివారం కావడాన కాబోలు-చాల సందడిగా ఉంది పార్కు కళకళల్లాడుతూ

చుట్టూ చూస్తోన్న రాధకళ్ళు ఒకచోట ఆగిపోయినయ్. ఆశ్చర్యంగా కనుబొమ్మలు పైకిలేచినాయ్. అనుమానంగా చూస్తూ అడుగున అడుగువేస్తూ దూరంగా కన్పిస్తోన్న జంటవైపు నడిచింది రాధ.

నిజంగా శ్యామా నాకీ పెళ్ళి ఇష్టంలేదు. కాని కట్నం కోసమని మావాళ్ళు నాచేత బలవంతంగా తాళిగట్టించేరు. నువ్వే ఎప్పటికీ నా హృదయరాణివి-నీమీద వొట్టు" అంటూ అతను, ఆ ప్రక్కన కూచున్న అమ్మాయి చేతినందుకుని పెదవుల కానించుకున్నాడు మన్నితంగా.

ఆ అమ్మాయి తన్మయత్వంగా అతని భుజంమీద తలవాల్చి కళ్ళుమూసుకొంది.

అలికిడివిని తలత్రిప్పిన అతను పిడుగుపాటు తగిలినవాడిలా అయిపోయేడు-అతడు-వినయ్.

రాధ కళ్ళు నిప్పులు కక్కుతున్నాయ్. ప్రపంచంలోని అసహ్యమంతా ఆ అందమైన ముఖంలో గూడుకట్టుకుని కన్పిస్తోంది.

అదిరిపాటుతో నిలబడ్డాడు వొక్కసారిగా. గుంటూరులోని మనిషిరాధ ఇప్పుడు-ఇక్కడ-ఎలా వొచ్చింది?

"యూ స్కౌండ్రల్" అంటూ పార్కులో తన భర్తని చాచిలెంపకాయ కొట్టింది రాధ.

ఎర్రగా కందిన చెంపమీదికి వెళ్ళింది వినయ్ చేయి అప్రయత్నంగా.

యాభై వేలు ధారపోసి నీలాంటి పిరికి వెధవని, మోసగాడిని కట్టుకున్నందుకు నిజంగా సిగ్గుపడుతున్నాను. ఇంక నీకూ నాకూ ఈ క్షణం నుండీ రుణం తీరిపోయింది. గుడ్‌బై ఫరెవ్వర్" రాధ సుడిగాలిలా వెళ్ళిపోయింది అక్కడినుండి.

అప్పటికి తేరుకున్న శ్యామలకి జరిగిందేమిటో అర్థమైంది.

"డబ్బుకాశపడి మీ అమ్మవాళ్ళు ఓ కురూపిని నీకంట గట్టేరని చెప్పి నాతో అబద్ధాలాడుతావా? ఇట్లా ఎంతకాలం నన్ను మోసం చెయ్యాలనుకున్నావ్? ఛీ-నీమొహం నాకింక చూపించకు" శ్యామల రౌద్రంగా ఈసారి వినయ్ రెండవ చెంప చెళ్ళుమన్పించింది.

వినయ్‌కి కళ్ళు తిరిగేయి-తెప్పపాటులో జరిగిన ఈ రెండు సంఘటనలకి—

తిరిగి కళ్ళు తెరిచేప్పటికి

పూర్ ఫెలో!

-జాస్తి రమాదేవి
(సికిందరాబాద్)

(27)